# ఏటూరునాగారంలో కాంగ్రెస్ పార్టీ నూతన కార్యాలయం ప్రారంభం

**● మంత్రి సీతక్క చేతుల మీదుగా కార్యాలయ ప్రారంభోత్సవం -- పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలి**

**● ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామస్థాయిలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలి**

తెలుగు గళం ఏటూరునాగారం :

ఏటూరునాగారం మండల కేంద్రంలోని వై జంక్షన్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి మరియు మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క ఘనంగా ప్రారంభించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దేవులపల్లి విజయ్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను గ్రామ గ్రామాన ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నాయకులు, కార్యకర్తలు అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. రేపటి నుంచి గ్రామ సభలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఎస్ఐఆర్ ఓటర్ జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూడాలని, ఎవరూ ఓటు హక్కును కోల్పోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె పేర్కొన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వెంటనే పరిష్కరించేందుకు నాయకులు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమానికి ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ మరియు ఎస్ఐఆర్ ములుగు జిల్లా ఇన్‌చార్జ్ ప్రకాష్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ కార్యాలయం కార్యకర్తలకు ఒక వేదికగా నిలిచి పార్టీ కార్యకలాపాలకు మరింత ఊతమివ్వాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పైడాకుల అశోక్, గ్రంథాలయ చైర్మన్







బానోత్ రవిచందర్, జిల్లా ఆత్మ చైర్మన్ చిటమట రఘు, జిల్లా ప్రధాన కార్యదర్శి గుడ్ల దేవేందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇర్సవడ్ల వెంకన్న, జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షులు ఎండీ తాజ్, జిల్లా సెక్రటరీ ఎండీ ఖలీల్ ఖాన్, జిల్లా అధికార ప్రతినిధి ముక్కెర లాలయ్య, ఏటూరునాగారం డివిజన్ ఆత్మ చైర్మన్ కర్ల అరుణ, ప్యాక్స్ వైస్ చైర్మన్ చెన్నూరి బాలరాజు, మండల ప్రధాన కార్యదర్శి వావిలాల ఎల్లయ్య, జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కొండగొర్ల పోషయ్య, జిల్లా యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు సర్వ అక్షిత్, టౌన్ అధ్యక్షులు కే రంజిత్, టౌన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సరికొప్పుల శ్రీనివాస్, డైరెక్టర్లు, సర్పంచులు, మహిళా నాయకులు, యువజన నాయకులు, సీనియర్ నాయకులు, జిల్లా, మండల, గ్రామ స్థాయి కాంగ్రెస్ నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రేగొండ మండలంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**

**● అర్హులందరికీ ఆహార భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం**

**● దమ్మన్నపేట,దుంపుల్లపల్లి,రేగొండ,మడతపల్లి గ్రామాల్లో కార్డుల అందజేత**







తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి రేగొండ

ప్రతి అర్హత కలిగిన నిరుపేద కుటుంబానికి ఆహార భద్రత కల్పించడమే ప్రజా ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు స్పష్టం చేశారు.బుధవారం రేగొండ మండలంలోని దమ్మన్నపేట,దుంపుల్లపల్లి,రేగొండ రైతు వేదికలలో మడతపల్లి ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ఆయన పాల్గొని లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని,ఏళ్ల తరబడి కార్డుల కోసం ఎదురుచూస్తున్న అర్హులైన పేదలకు న్యాయం చేస్తున్నామని తెలిపారు.స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు మరింత పారదర్శకంగా లబ్ధిదారులకు చేరుతాయన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదల జీవన ప్రమాణాలు మెరుగుపరచడంతో పాటు మహిళా సాధికారత,రైతుల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కె.శ్వేత, డీటీ రజాక్, ఆర్ఐ వెంకటేశ్వర్లు, డీసీవో కిరణ్ కుమార్, డీఎం రాములు, సివిల్ సప్లై ఆర్ఐ భాస్కర్ల రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ గూటోజు కిష్టయ్య,పీఏసీఎస్ చైర్మన్ నడిపెల్లి విజ్జన్ రావు, కోటంచ దేవస్థానం చైర్మన్ నాయినేని సంపత్ రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పున్నం రవి, నాయకులు మోడెం ఉమేష్ గౌడ్, పుల్లూరి బాబురావు, ఏనుగు రవీందర్ రెడ్డి, స్థానిక సర్పంచులు,డీలర్లు,సంబంధిత శాఖ అధికారులు,గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అహ్మదీయ ముస్లిం కమ్యూనిటీకీ ఆధ్వర్యంలో మిలాద్‌ఉన్ నబీ సందర్భంగా మానవతా సేవలు

**ములుగు, భూపాలపల్లి, పరకాలలో రోగులు, నిరాశ్రయులు, బాలికలకు పండ్ల పంపిణీ**



తెలుగు గళం న్యూస్ ములుగు/భూపాలపల్లి, ఆగస్టు 26

మిలాద్‌ఉన్ నబీ సందర్భంగా అంతర్జాతీయ అహ్మదియ్య ముస్లిం జమాఅత్ హన్మకొండ జిల్లా ఆధ్వర్యంలో పలు మానవతా సేవా కార్యక్రమాలను నిర్వహించారు.హన్మకొండ జిల్లా అహ్మదియ్య ముస్లిం యువజన సంఘం (ఖుద్దాముల్ అహ్మదియ్య) ఆధ్వర్యంలో ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లోని ప్రభుత్వ ఆసుపత్రులు, నిరాశ్రయుల వృద్ధాశ్రమం, పరకాలలోని బాలికల అనాథ ఆశ్రమంలో పండ్లు పంపిణీ చేశారు.కార్యక్రమంలో భాగంగా ముందుగా ములుగు పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ ఇమ్మానుయేల్‌ను జిల్లా జమాఅత్ కమిటీ సభ్యులు కలిసి ప్రవక్త మహమ్మద్ జీవిత చరిత్ర పుస్తకాన్ని బహూకరించారు.అనంతరం పోలీసులకు మిఠాయిలు పంపిణీ చేశారు. ఆ తర్వాత ములుగు ప్రభుత్వ ఏరియా వైద్యశాలలోని రోగులకు, జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు అందజేశారు.భూపాలపల్లిలోని నిరాశ్రయుల వృద్ధాశ్రమంలోని వారికి, పరకాలలోని బాలికల అనాథ ఆశ్రమంలోని బాలికలకు కూడా పండ్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా జమాఅత్ అధ్యక్షుడు ముహమ్మద్ యాకూబ్, జిల్లా జమాఅత్ ఇన్‌చార్జి ముహమ్మద్ ఉస్మాన్ మాట్లాడుతూ ప్రవక్త మహమ్మద్ దయ, దానధర్మాలు, మానవతా విలువలకు ప్రతీకగా నిలిచారని అన్నారు.సమాజంలోని ప్రతి ఒక్కరూ తమకు సాధ్యమైనంత మేర ఇతరులకు సహాయం చేయాలని, పేదలు, ఆపదలో ఉన్నవారి పట్ల కరుణతో వ్యవహరించాలని ఆయన బోధించారని తెలిపారు.ప్రవక్త మహమ్మద్ తన వద్ద సంపదను నిల్వ ఉంచకుండా అవసరమైన వారికి పంచేవారని ఆయన జీవితంలోని సంఘటనలను గుర్తుచేశారు. ఆయన బోధనల స్ఫూర్తితో ప్రపంచవ్యాప్తంగా అహ్మదియ్య ముస్లిం జమాఅత్ అనేక మానవతా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోందని, అందులో భాగంగానే మిలాద్‌ఉన్ నబీ సందర్భంగా ఈ సేవా కార్యక్రమాలను చేపట్టామని వారు తెలిపారు.మత, కుల, ప్రాంత భేదాలకు అతీతంగా మానవత్వం, ప్రేమ, శాంతి, సోదరభావాన్ని పెంపొందించడమే ఇలాంటి సేవా కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు పేర్కొన్నారు. మిలాద్‌ఉన్ నబీ సందర్భంగా పేదలు, రోగులు, నిరాశ్రయులు, అనాథ బాలికలను ఆదుకోవడం ద్వారా ప్రవక్త బోధించిన మానవతా సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. మిలాద్‌ఉన్ నబీ సందర్భంగా మానవత్వం, కరుణ, శాంతి, సోదరభావం వంటి విలువలను ఆచరించాలనే సందేశం విస్తృతంగా ప్రస్తావించబడుతోంది.ఈ కార్యక్రమంలో జిల్లా యువజన సంఘం అధ్యక్షుడు సయ్యద్ ముజాహి, జిల్లా కమిటీ సభ్యులు







సయ్యద్ వలి, ముహమ్మద్ అక్బర్, సయ్యద్ జావీద్, సయ్యద్ కరీమ్, షేక్ నేమత్, మహమ్మద్ షరీఫ్, జమాఅత్ గురువులు మష్హూద్ అహ్మద్, ముహమ్మద్ అస్గర్, ముహమ్మద్ సర్వర్, ముహమ్మద్ రహీముద్దీన్, సయ్యద్ సలీమ్, అబ్దుల్లా, ఆసిఫ్, తలహా, మౌలా, రియాజ్, సయ్యద్ కరీమ్ తదితరులు పాల్గొన్నారు.

# బాంబు పేలుడులో గాయపడిన మహిళను పరామర్శించిన ఎమ్మెల్యే గండ్ర





తెలుగు గళం న్యూస్
భూపాలపల్లి రేగొండ

వ్యవసాయ పనుల్లో భాగంగా ప్రమాదవశాత్తు బాంబు పేలి గాయపడిన కూలీ గుండె స్వర్ణలతను భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు బుధవారం పరామర్శించారు. రేగొండ మండలం గూడేపల్లి గ్రామానికి చెందిన స్వర్ణలత చేనులో పని చేస్తుండగా, గుర్తుతెలియని వ్యక్తులు అడవి జంతువుల కోసం అమర్చిన బాంబు పేలి తీవ్రంగా గాయపడింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గండ్ర, స్థానిక ఎస్సై సుధాకర్, ప్రజాప్రతినిధులతో కలిసి బాధితురాలి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.అనంతరం అధికారులతో మాట్లాడుతూ.. ప్రజల ప్రాణాలకు ముప్పు తెచ్చేలా పేలుడు పదార్థాలు అమర్చే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని,ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నిఘా పెంచాలని ఆదేశించారు.బాధితురాలి కుటుంబానికి ప్రభుత్వం తరఫున అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొలుగూరి రాజేశ్వరరావు,ఎస్ఎస్ఆర్ సంస్థల చైర్మన్ నాయినేని సంపత్ రావు,కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పున్నం రవి,ఎర్రబెల్లి రవీందర్ రావు,ఇతర నాయకులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

# జానపద కళాకారులకు ప్రభుత్వం అండ

## :ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు





తెలుగు గళం న్యూస్
భూపాలపల్లి రేగొండ

జానపద కళలు పల్లెల్లో సమస్యలను ఎత్తి చూపుతూ ప్రజల్లో చైతన్యాన్ని, ఆనందాన్ని నింపుతాయని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో కళాకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో రేగొండ మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన ప్రపంచ జానపద దినోత్సవ ర్యాలీ,వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం జానపద,సాంస్కృతిక కళాకారుల సంక్షేమానికి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కళాకారుల పట్ల ప్రత్యేక గౌరవం ఉందని పేర్కొన్నారు.అర్హులైన నిరుపేద జానపద కళాకారులకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు అందించేందుకు కృషి చేస్తానని,ప్రభుత్వ సంక్షేమ పథకాలు,అవసరమైన రాయితీలు ముందుగా అందేలా సహకరిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గూటోజు కిష్టయ్య,పీఏసీఎస్ చైర్మన్ నడిపెల్లి విజ్జన్ రావు,కోటంచ దేవస్థానం చైర్మన్ నాయినేని సంపత్ రావు,కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పున్నం రవి,సర్పంచ్ వారణాసి మౌనిక అంజి,నాయకులు మోడెం ఉమేష్ గౌడ్,పుల్లూరి బాబురావు,మేకల బిక్షపతి,మనోహర్ రెడ్డి,ఏనుగు రవీందర్ రెడ్డి తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో కళాకారులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

# ధర్మపురంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నూతన గ్రామ కమిటీ ఎన్నిక



ధర్మసాగర్, (తెలుగు గళం)ఆగస్టు 26:

ధర్మసాగర్ మండలం ధర్మపురం గ్రామంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నూతన గ్రామ కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ ధర్మసాగర్ మండల అధ్యక్షుడు సింగరపు పవన్ మాదిగ, ఎమ్మార్పీఎస్ మాజీ మండల అధ్యక్షుడు సోంపెల్లి అన్వేష్ మాదిగ ముఖ్య అతిథులుగా హాజరై నూతన కమిటీ ఎన్నికను పర్యవేక్షించారు.ఎమ్మార్పీఎస్ ధర్మపురం గ్రామ నూతన కమిటీ అధ్యక్షుడిగా భారీగాలా ప్రదీప్ కుమార్ మాదిగ, అధికార ప్రతినిధిగా బరిగల వినోద్ మాదిగ ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శులుగా బరిగల అరవింద్ మాదిగ, బరిగల అఖిల్ మాదిగలను ఎన్నుకున్నారు.ఉపాధ్యక్షుడిగా బరిగల సంగీత్, కోశాధికారిగా బైరిపాక అజిత్ మాదిగ బాధ్యతలు స్వీకరించారు. కార్యదర్శులుగా బైరిపాక అరుణ్ కుమార్ మాదిగ, భారీగాలా ప్రేమ్ మాదిగ, సహాయ కార్యదర్శిగా పులి ప్రణయ్ మాదిగ ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు నాయకులు అభినందనలు తెలిపారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ బలోపేతానికి నూతన కమిటీ సభ్యులు కృషి చేయాలని వారు సూచించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు, కార్యకర్తలు, గ్రామానికి చెందిన పలువురు పాల్గొన్నారు.

# గుండెపోటుతో బీటెక్ విద్యార్థి మృతి



జన్నారం,తెలుగు గళం: గుండెపోటుతో బీటెక్ విద్యార్థి మృతి చెందిన ఘటన హైదరాబాద్‌లో బుధవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా జన్నారం మండలం చింతగూడ గ్రామానికి చెందిన పోషన్న, నరసవ్వ దంపతుల కుమారుడు మనోహర్ (24) రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలోని ఓ కళాశాలలో బీటెక్ చివరి సంవత్సరం చదువుతున్నాడు. రెండు రోజుల క్రితం జ్వరం రావడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బుధవారం గుండెపోటుతో మనోహర్ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు, బంధువులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. పోషన్న నరసవ్వ దంపతులకు పిల్లలు లేకపోవడంతో మనోహర్‌ను దత్తత తీసుకున్నారు. ఎంతో అల్లారు ముద్దుగా పెంచుతూ చదివిస్తున్నారు. ఈ నేపథ్యంలో మనోహర్ హఠాన్మరణంతో తల్లిదండ్రులు కన్నీటి పర్యంతం అవుతున్నారు.

